సాక్షి కర్నూలు

శనివారం। 13। మే। 2023



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన నటరాజ కూచిపూడి కళానిలయం వారిచే నిర్వహించిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది.



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు సహస్రనామ పూజలు చేపట్టారు.



..చక్కని పరిష్కారం

చుక్కల భూముల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం చక్కని పరిష్కారం చూపుతోంది. జిల్లాలో 26,652.08 ఎకరాలను చుక్కల జాబితా 22 ఏ(1)ఈ నుంచి తొలగించింది. IIలో▸

న్యూస్‌రీల్

ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో జీవో నెం.143 ప్రకారం 14 మంది సిబ్బంది మాత్రమే ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య తెలిపారు. అంతకంటే ఎక్కువగా ఎవ్వరైనా ఉంటే వారి వివరాలు తెలపాలన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఏ పీహెచ్‌సీలో ఎంత మంది సిబ్బంది ఉన్నారో వివరాలు తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీపీఎంవో డాక్టర్ ఉమ, ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ కో ఆర్డినేటర్ డాక్టర్ శైలేష్‌కుమార్, ఎఫ్‌పీసీ నోడల్ అధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ, డీపీహెచ్‌ఎన్‌వో ఇందిర పాల్గొన్నారు.

17న విద్యుత్ శాఖ సీఎండీ కర్నూలు రాక

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు ఈ నెల 17వ తేదీన కర్నూలుకు రానున్నారు. అదే రోజు ఉదయం 10గంటలకు కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యుత్ ఎస్ఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏడీఈలు, ఏఈలతో సమీక్ష నిర్వహించనున్నారు.

ఆర్‌బీకేలకు వైఎస్ఆర్ రైతుభరోసా జాబితాలు

కర్నూలు(అగ్రికల్చర్): వరుసగా ఐదో ఏడాదికి వైఎస్ఆర్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం విడుదలకు సంబంధించి ఆర్‌బీకే వారీగా అర్హుల జాబితా సోషల్ ఆడిట్‌కు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే అర్హులు, అనర్హుల జాబితాలు ఆర్‌బీకేలకు చేరాయి. వీటిని ఆర్‌బీకే ఇన్‌చార్జీలు డౌన్‌లోడ్ చేసి రైతుల పరిశీలనకు పెట్టి అభ్యంతరాలు తీసుకోవడం, వాటిని పరిశీలించి అప్‌లోడ్ చేసేందుకు ప్రభుత్వం షెడ్యూలు ఇచ్చింది. ఈ నెల 12న జాబితాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తారు. 15 నుంచి 18వ తేదీ వరకు కొత్త రైతుల రిజిస్ట్రేషన్ వివరాలు, అభ్యంతరాలను వీఏఏలు వైఎస్ఆర్ రైతుభరోసా పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేస్తారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు వీటిని మండల వ్యవసాయాధికారులు పోర్టల్‌లో ఆమోదించడం లేదా తిరస్కరించడం జరుగుతుంది. ఈ 25 నుంచి 31వ తేదీలోపు ఏ రోజైన వైఎస్ఆర్ రైతుభరోసాతో పాటు 2022 ఖరీఫ్ పంటల బీమా పరిహారం, అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారు.

తాత్కాలిక టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలో పార్ట్‌టైమ్(తాత్కాలికం) టీచర్ ఉద్యోగాలకు అభ్యర్థులు ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా టెట్ అర్హత సాధించి ఉండాలని, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఎడ్ కూడా పూర్తి చేసి ఉండాలన్నారు. విద్యార్హతలతో కూడిన దరఖాస్తులను కర్నూలులోని జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందజేయాలన్నారు. అభ్యర్థుల ఎంపిక డెమో ప్రాతిపదికన చేపడతామన్నారు. ఈనెల 25న స్థానిక దిన్నెదేవరపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో డెమో నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9959958264, 9010070219 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కొబ్బరి బోండాల లారీ బోల్తా

డోన్ టౌన్: కర్నూలు - బెంగళూరు జాతీయ రహదారిపై తాటిమానుకొత్తూరు గ్రామ సమీపంలో శుక్రవారం కొబ్బరి బోండాల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలో ఉన్న కొబ్బరి బోండాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. విషయం తెలుసుకున్న చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనదారులు సందిట్లో సడేమియా అన్నట్లు కొబ్బరి బోండాలను అందిన కాడికి పట్టుకెళ్లారు. మరి కొంత మంది ట్రేలు, సంచులు తీసుకెళ్లారు. లారీ డ్రైవరు, వ్యాపారులు అక్కడే ఉన్నా నివారించలేకపోయారు.



☛ ఎమ్మిగనూరులో ఉపాధ్యాయ వృత్తి చేస్తున్న యువకునికి కర్నూలుకు చెందిన యువతితో 2021లో వివాహమైంది. ఈమె పీజీ వరకు చదువుకుంది. వీరికి ఓ కుమారుడు సంతానం. పల్లెటూరు వాతావరణంలో ఇమడలేక, వేరు కాపురం పెట్టాలనే కోరికతో వేధింపుల కేసు పెట్టి పుట్టింటికి చేరుకుంది. కేసు ఫ్యామిలీ కోర్టులో నడుస్తోంది.

☛ కర్నూలుకు చెందిన 20 ఏళ్ల యువతికి ఆళ్లగడ్డకు చెందిన యువకునితో 2021లో వివాహమైంది. ఇతను ప్రభుత్వ ఉద్యోగి. పెళ్లయ్యాక ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులతో కలిసి ఆదోనిలో ఉంటోంది. నువ్వే నా వద్ద ఉండాలని ఆమె, కాదు నువ్వే నా దగ్గర ఉండాలని అతను కోరుతుండటంతో ఇద్దరి మధ్య దూరం పెరిగి కేసు కోర్టుకు చేరింది.

☛ కర్నూలుకు చెందిన ఓ దంత వైద్యుడు తొమ్మిది నెలల క్రితం ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహం అమ్మాయి తల్లిదండ్రులకు ఇష్టంలేదు. మధ్య తరగతి కుటుంబం, తల్లి మాటకు విలువ ఇస్తుండటాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయింది. నెల రోజులకే వేరు కాపురం పెట్టించింది. ఆ తర్వాత కూడా అతను మారలేదని భావించి కోర్టుకెక్కింది.

అడుగులు తడబడి.. మనసులు విడివడి!

ఏడాది తిరక్కుండానే విడాకులు

- వేరు కాపురం కోరుకుంటున్న యువత
- విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థ
- లోపిస్తున్న సర్దుబాటు ధోరణి
- చిన్న విషయాలకే పెరుగుతున్న దూరం
- ఉమ్మడి కుటుంబాలు లేకపోవడమే కారణం

పెళ్లంటే వందేళ్ల పంట. ఇద్దరు మనుషులు ఒక్కటే మనసుగా జీవించే బంధం. మూడు ముళ్లు.. ఏడడుగులతో మొదలైన జీవితం.. కష్ట సుఖాల్లో తోడుగా.. అడుగడుగులో నీడగా సాగుతుంది. ఇలాంటి పవిత్ర బంధం కాస్తా ఇప్పుడు మూన్నాళ్ల ముచ్చటగా మిగులుతోంది. చీటికీ మాటికీ విడాకుల మాట తెరపైకి వస్తోంది. సర్దుబాటు ధోరణి పోయి.. నువ్వెంతంటే నువ్వెంతంటూ తెగే దాకా లాగటం మామూలైంది. నాలుగు గోడల మధ్య గుట్టుగా సాగాల్సిన సంసారం నలుగురిలో నవ్వుల పాలవుతోంది.

– సాక్షి, కర్నూలు డెస్క్



భారతీయ వివాహానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అనాదిగా వస్తున్న సంప్రదాయాలు, పెద్దలు నిర్ణయించిన కట్టుబాట్ల నేపథ్యంలో ఇక్కడి కుటుంబ వ్యవస్థ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. విదేశాల్లో విడాకులు కాఫీ తాగినంత సులువే అయినా.. మన దేశంలో ఇటీవల కాలంలో ఆ జాడ్యం విస్తరిస్తోంది. భార్యాభర్తలు కూర్చొని మాట్లాడుకోవాల్సిన సమస్యలు కూడా కోర్టుల దాకా వెళ్తుండటం ఆందోళన కలిగించే విషయం. పెద్దలు సర్దిచెప్పినా సద్దుమణిగే అవకాశం ఉన్నా ఎవరు ఒప్పుకోవాలనే అంశం వద్దే ఆగిపోతుండటం రెండు జీవితాల మధ్య అగాథం సృష్టిస్తోంది. పట్టుమని సంవత్సరం కూడా గడవక మునుపే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడటం, పుట్టింటికి చేరుకోవడం.. ఆ వెంటనే విడాకుల దిశగా అడుగులు వేయడం జరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

అడ్డుగోడలా చదువు.. సంపాదన

పెళ్లి చేయాలనే ఆలోచన రాగానే అబ్బాయికి ఉద్యోగం ఉండాలి, అమ్మాయి బాగా చదువుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అమ్మాయికి ఉద్యోగం ఉంటే, అబ్బాయి కూడా ఉద్యోగస్తుడైతే బాగుంటుందని అనుకుంటారు. తల్లిదండ్రుల ఆలోచనలు బాగానే ఉన్నా.. పెళ్లయ్యాక నీకంటే నేను ఏమి తక్కువనే భావన సంసారంలో అడ్డుగోడగా మారుతోంది. సంపాదన విషయంలో హెచ్చుతగ్గులు కూడా చినికిచినికి గాలివానగా మారి ఇక మనం కలిసి ఉండలేమనే వరకు తీసుకొస్తుంది.

తల్లిదండ్రుల వత్తాసు

బోలెడు కట్నకానుకలు ఇచ్చి పెళ్లి చేస్తున్న తల్లిదండ్రులు అమ్మాయికి మెట్టినింట్లో నడుచుకోవాల్సిన తీరును తెలియజెప్పలేకపోతున్నారు. కూతురుకు తలనొప్పి వచ్చినా అల్లుడే కారణమనే ధోరణి వీరిలోనే కనిపిస్తోంది. అనారోగ్యం చేసినా కుటుంబ సభ్యులు వేపుకు తింటున్నారనే భావన ఇక్కడి నుంచే మొదలవుతుంది. సమస్యను సర్దుబాటు చేయాల్సింది పోయి పుట్టింటికి ఆహ్వానం పలకడం భార్యాభర్తల మధ్య దూరం పెరిగేందుకు కారణమవుతోంది.

నేను, నా భర్త..

కుటుంబం అంటే నేను, నా భర్త అనే ధోరణి ఇటీవల కాలంలో అధికమైంది. అత్తామామలు తమ వద్ద ఉంటే స్వేచ్ఛ ఉండదనే భావన వేరు కుంపటికి కారణమవుతోంది. ముచ్చటపడి వేరు కాపురం పెట్టినా.. మంచీ చెడు చెప్పే పెద్ద దిక్కు లేక సంసారంలో చీటికీమాటికి కలతలు అధికమవుతున్నాయి. ఏడాది తిరక్క మునుపే కడుపు పండినా.. ఆ తర్వాత కూడా పరిస్థితులు సర్దుబాటు కాక, సర్దుకుపోలేక అమ్మాయిలు పుట్టింటికి చేరుకుంటున్న ఘటనలు ఇటీవల కాలంలో కోకొల్లలు.

కూతురులా చూసుకోకపోవడం..

తమ కుమార్తె ఇంకొకరి ఇంటికి కోడలిగా వెళ్తే బాగుండాలని కోరుకునే తల్లిదండ్రులు.. తమ ఇంట్లో దీపం పెట్టేందుకు వచ్చిన కోడలి విషయంలో అలాంటి ఆలోచన చేయకపోవడం సమస్యకు దారితీస్తుంది. తామూ ఓ ఇంటికి కోడలిగానే వచ్చామనే విషయాన్ని మరిచి, ఆడ..పిల్లను కూతురుగా చూసుకోలేకపోవడం భార్యాభర్తల మధ్య తగవుకు కారణమవుతోంది. భర్త కూడా తల్లికే వత్తాసు పలకడం, తననే నమ్ముకుని వచ్చిన భార్యను నిర్లక్ష్యం చేయడం కూడా అమ్మాయి అడుగులు పుట్టింటి వైపు పడేలా చేస్తుంది.

ఉమ్మడి కుటుంబాలు కనుమరుగు

పట్టణాల సంగతి పక్కనపెడితే.. పల్లెల్లోనూ ఉమ్మడి కుటుంబాలు బూతద్దం పెట్టి వెతికినా కనిపించని పరిస్థితి. ఇంట్లో ఉన్న ఇద్దరు, ముగ్గురికి పెళ్లిళ్లు అయ్యాయంటే చాలు.. మాది మాకిస్తే వెళ్లిపోతామనే ధోరణి కనిపిస్తోంది. వచ్చింది పావలా అయినా, వేరు కాపురం పెడితే చాలు మా బతుకు మేం బతుకుతామనే ఆలోచన అధికమవుతుంది. ఉమ్మడి కుటుంబంలో ఉంటే ఎలాంటి సమస్య వచ్చినా కూర్చొని మాట్లాడుకునే అవకాశం ఉంటుంది. కష్టం వస్తే కన్నీళ్లు తుడిచే చేతులు బోలెడు ఉంటాయి. పిల్లలకు మంచీచెడు చెప్పే విషయంలోనూ 'ఉమ్మడి కుటుంబం' ఎంతో మేలు చేస్తుంది. ఇలాంటి ఉమ్మడి తియ్యదనం ఈ కాలం అమ్మాయిలు, అబ్బాయిలకు రుచించకపోవడం ఇద్దరికీ చేటు చేస్తోంది.



ముచ్చటైన కుటుంబం

నందవరం మండలంలోని సోమలగూడూరు గ్రామానికి చెందిన పెద్ద పెద్దిరెడ్డి కుటుంబం 'ఉమ్మడి' ఆనందం పొందుతోంది. పెద్ద పెద్దిరెడ్డి(లేట్), సంజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కె. వెంకటరామిరెడ్డి, కె.రామలింగారెడ్డి. ఇద్దరు కుమార్తెలు వెంకటేశ్వరమ్మ, రాఘవేంద్రమ్మలు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు వెంకటరామిరెడ్డికి ముగ్గురు కుమారులు ఉండగా కోడళ్లు, మనువళ్లు, మనవరాళ్లు కలిపి 11 మంది. చిన్న కుమారుడు రామలింగారెడ్డికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సంజమ్మ కూతుళ్లు వెంకటేశ్వరమ్మ, రాఘవేంద్రమ్మలకు అంగవైకల్యం, మతిస్థిమితం లేకపోవడంతో అన్నదమ్ములే అలనా పాలనా చూస్తున్నారు. మొత్తం 23 మంది కుటుంబ సభ్యులు ఒకే ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. బేషజాలకు పోకుండా అందరూ ఒకే మాటపై నడుచుకోవడం చూస్తే ముచ్చటేస్తుంది.

ఫ్యామిలీ కోర్టులో దాఖలైన కేసులు

సంవత్సరం	కేసుల సంఖ్య
2019	153
2020	165
2021	190
2022	220
2023(ఇప్పటి వరకు)	90

విడాకులకు కారణాలు కొన్ని..

- ➡ సర్దుకుపోయే స్వభావం లేకపోవడం.
- ➡ వ్యక్తిగత స్వేచ్ఛను కోరుకోవడం.
- ➡ ప్రేమాభిమానాలు లోపించడం.
- ➡ ఒకరిపై ఒకరికి అనుమానం.
- ➡ అజమాయిషీ విషయంలో పంతాలకు పోవడం.
- ➡ పెద్దల మితిమీరిన జోక్యం.
- ➡ అత్తమామలు తమ వద్ద ఉండకూడదని కోరుకోవడం.
- ➡ వేరు కాపురం పెట్టాలనుకోవడం.

పెద్దల మధ్య ఉన్నప్పుడే బాధ్యత తెలుస్తుంది



కుటుంబ వ్యవస్థ మీద అవగాహన లేకపోవడం, సర్దుకుపోయే మనస్తత్వం కొరవడటం కారణంగానే యువ జంటలు విడాకులు కోరుకుంటున్నారు. పెరిగిన వాతావరణం, అంతులేని ఆర్థిక స్వేచ్ఛ, వివాహేతర సంబంధాలు కూడా ఇందుకు కారణమవుతున్నాయి. ఉమ్మడి కుటుంబాల్లో జీవించినప్పుడే ప్రేమ, ఆప్యాయతల విలువ తెలుస్తుంది. పెద్దల మధ్య ఉన్నప్పుడే బాధ్యత అలవడుతుంది. అత్తమామలను తల్లిదండ్రులుగా చూసినప్పుడే బంధం కలకాలం నిలుస్తుంది.

– ఎ.లక్ష్మీసరస్వతి, అడ్వొకేటు, కర్నూలు



వెండి రథంలో భక్తులకు దర్శనమిచ్చిన మహాయోగి లక్ష్మమ్మవ్వ

అవ్వ రథోత్సవం.. భక్తిపారవశ్యం

మహాయోగి లక్ష్మమ్మవ్వ వెండి రథోత్సవాన్ని శుక్రవారం ఆదోని పట్టణంలో వైభవంగా నిర్వహించారు. వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. – ఆదోని అర్బన్



భక్త జనవాహిని మధ్య కొనసాగుతున్న రథోత్సవం

బనవాసి నవోదయలో ఇంటర్ ప్రవేశాలు

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని విద్యాలయ ప్రిన్సిపాల్ కె. సాగరిక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యార్థులు http://navodaya.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష జూలై 22న ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి చదివి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు.



ఒక్కటైన జంటలు.. ముచ్చటైన వేడుక

దాతల సహకారంతో శుక్రవారం 30 జంటలకు కౌతాళం మండలం మదిర గ్రామంలో సామూహిక వివాహాలు నిర్వహించారు. నూతన వధూవరుల తల్లిదండ్రులు, బంధువులతో ఉటగనూరు తాత మఠం ప్రాంగణం కళకళలాడుతూ కనిపించింది. – కౌతాళం

పింఛన్‌దారులు సత్వరం ఈ–కేవైసీ చేయించుకోవాలి

- నేడు, రేపు సెలవు దినాలైనా సబ్ ట్రెజరీలు పనిచేస్తాయి
- ఈ–కేవైసీ కోసం సబ్ ట్రెజరీల్లో ప్రత్యేక కౌంటర్లు

కర్నూలు(అగ్రికల్చర్): పింఛన్‌దారులు విధిగా తమ సీఎఫ్ఎంఎస్ ఐడీలను వారి ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నెంబర్లతో అనుసంధానం చేసుకోవాలని జిల్లా ఖజాన అధికారి రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ సీఎఫ్ఎంఎస్, హెచ్ఈఆర్‌బీ పేరోల్‌కు సంబంధించిన సేవలు పొందడానికి, ఆర్థిక భద్రతకు ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. ఈ అనుసంధానం అత్యవసరమని.. జిల్లాలో ఆరు సబ్ ట్రెజరీలు ఉండగా పెన్షనర్ల కోసం 8 మంది డీడీఓలు ఉన్నారన్నారు. జిల్లాలో 17,625 మంది పెన్షనర్లు ఉండగా.. ఇప్పటి వరకు 9,330 మంది మాత్రమే ఈ–కేవైసీ చేయించుకున్నట్లు చెప్పారు. పెన్షనర్లు ఈ–కేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 13, 14 తేదీలు సెలవు దినాలైనప్పటికీ జిల్లాలోని అన్ని సబ్ ట్రెజరీలు పనిచేస్తాయన్నారు. సబ్ ట్రెజరీల్లో పెన్షనర్ల ఈ–కేవైసీకి ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు సంబంధిత డీడీవోలను సంప్రదించి ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

మామిడి ధర తగ్గుముఖం

- టన్ను రూ.25వేల నుంచి రూ.30 వేలు

కర్నూలు(అగ్రికల్చర్): మామిడి సీజన్ ఆరంభంలో ధర అమాంతం పెరిగినా, ఇటీవల కాలంలో తగ్గుముఖం పట్టింది. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడం, ఒక్కసారిగా మార్కెట్‌లోకి పంట రావడంతో డిమాండ్ పడిపోయింది. మొదట్లో టన్ను ధర రూ.లక్ష పలికిన మామిడి.. నేడు మొదటి రకం మామిడి ధర టన్ను రూ.25వేల నుంచి రూ.30 వేలకు చేరుకుంది. కర్నూలులోని పండ్ల మార్కెట్‌కు కొద్ది రోజుల క్రితం వరకు రోజుకు 15 టన్నుల వరకు మామిడి వచ్చేది. నేడు 30 నుంచి 40 టన్నుల వరకు వస్తోంది. రిటైల్ మార్కెట్‌లో నాణ్యతను బట్టి కిలో ధర రూ.40 నుంచి రూ.60 వరకు పలుకుతోంది. తోటల వద్ద చాకులు కిలో రూ.80 ప్రకారం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ఒక మోస్తరు నాణ్యత కలిగిన మామిడి రూ.100కు నాలుగు కిలోల ప్రకారం కూడా విక్రయిస్తున్నారు. మామిడి ధర తగ్గుముఖం పట్టడంతో వినియోగదారులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.



కిలో రూ.60 చొప్పున విక్రయానికి ఉంచిన మామిడి పండ్లు

డిగ్రీ కాలేజీలకు నేటి నుంచి వేసవి సెలవులు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు నేటి(శనివారం) నుంచి ఈ నెల 31వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు వర్సిటీ కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ సుందరానంద పుచ్చా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకడమిక్ ఇయర్‌ను గాడిలో పెట్టాలనే ఉద్దేశంతో సెలవులు ఇవ్వకూడదని భావించినా.. అధ్యాపకులు, పలు విద్యార్థి సంఘాల నుంచి వచ్చిన వినతులను దృష్టిలో పెట్టుకొని ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు వేసవి సెలవులు ప్రకటించామన్నారు. అయితే పెండింగ్‌లోని సిలబస్‌కు ఈ నెల 22 నుంచి 31వ తేదిలోపు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి పూర్తి చేయాలని సూచించారు.

చుక్కల భూములకు చక్కని పరిష్కారం

- జిల్లాలో 26,652.08 ఎకరాల భూములకు డాట్స్ నుంచి విముక్తి
- 22ఏ(1)ఈ నుంచి వివిధ 22ఏ(1) ఏ,బీ,సీ,డీ సెక్షన్లకు బదలాయింపు
- నేరుగా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటే చుక్కలు తొలగించే అవకాశం



కర్నూలు(సెంట్రల్): చుక్కల భూముల సమస్యకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చక్కని పరిష్కారం చూపుతోంది. నిషేధిత జాబితాలో ఉన్న భూములపై అనుభవంలో ఉన్న రైతులకు హక్కులు కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 26,652.08 ఎకరాల భూములను చుక్కల జాబితా 22 ఏ(1)ఈ నుంచి తొలగించారు. ఈ మేరకు కర్నూలు జిల్లాకు సంబంధించి జీఓ నంబర్ 170ని ప్రభుత్వం విడుదల చేసింది.

శతాబ్దకాలం నాటి సమస్య...

బ్రిటీష్ కాలంలో సుమారు వంద సంవత్సరాల క్రితం భూ సర్వే జరిగింది. అప్పుడు ప్రభుత్వ భూమి, ప్రైవేట్ భూమి అని నిర్ధారణ చేయని కారణంగా రెవెన్యూ రికార్డుల్లో (రీ సెటిల్‌మెంట్ రిజిస్ట్రార్-ఆర్‌ఎస్‌ఆర్) పట్టాదారు గడిలో చుక్కలు పెట్టి వదిలివేశారు. ఈ భూములను దశాబ్దాలుగా అనుభవిస్తున్న రైతులకు సంపూర్ణ హక్కులు రావడం లేదు. కుటుంబ అవసరాల కోసం వాటిని అమ్మదలుచుకుంటే రిజిస్ట్రేషన్ కావడం లేదు. రైతులకు ఇబ్బంది కలిగేలా 2016లో అప్పటి ప్రభుత్వం ఈ భూములను నిషేధిత జాబితాలో ఉంచింది. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చుక్కల భూములకు చక్కని పరిష్కారం చూపింది.

అనుమానం ఉంటే కలెక్టర్‌కు అర్జీ పెట్టుకోవాలి

కర్నూలు జిల్లాలో చుక్కల భూముల జాబితా 22 ఏ(1)ఈ లో 9,390 మంది రైతులకు సంబంధించి 26,652.08 ఎకరాలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేకరు జిల్లా రెవెన్యూ అధికారులు ఆర్‌హెచ్‌ఆర్, ఆర్‌ఓఆర్, అడంగల్ ఆధారంగా పూర్తి స్థాయిలో పరిశీలన చేశారు. అనంతరం చుక్కల భూముల జాబితా 22 ఏ(1)ఈలో ఉన్న భూములను 22 ఏ(1)ఏకు మార్పు చేశారు. మొత్తం 9,153 మంది రైతులకు సంబంధించి 25,950.45 ఎకరాలను బదలాయించారు. ఈ సెక్షన్‌లో ఉన్నవి పూర్తిగా ప్రభుత్వ భూములు. అలాగే 63 మంది రైతులకు సంబంధించి 176.45 ఎకరాలను 22 ఏ(1)బీకు, ఏడుగురు రైతులకు సంబంధించి 23.67 ఎకరాలు 22 ఏ(1)సీకు, 19 మంది రైతులకు సంబంధించి 101.38 ఎకరాలను 22ఏ(1)డీ కు బదలాయించారు. ప్రస్తుతం 22ఏ(1)ఈలో కేవలం 30 మంది రైతులకు సంబంధించి 61.07 ఎకరాలు మాత్రమే ఉన్నాయి. ఇతర సెక్షన్లకు బదిలీ అయిన చుక్కల భూములపై రైతులు సంపూర్ణ హక్కులు పొందేందుకు నేరుగా కలెక్టర్లకు అర్జీ పెట్టుకోవాల్సి ఉంది. వారి దగ్గర ఉన్న భూమికి సంబంధించి పత్రాలు, అనుభవం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని హక్కులు కల్పిస్తారు. కనీసం 12 సంవత్సరాలు అనుభవంలో ఉన్న రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటారు.

మ్యుటేషన్ చేసుకుంటే రైతుల పేరిట రికార్డు

జిల్లాలో గతంలో 108 మంది రైతులకు సంబంధించి 339.36 ఎకరాల భూములకు డాట్స్ నుంచి విముక్తి కలిగించారు. ఆన్‌లైన్ డాట్స్‌ను తొలగించారు. ప్రస్తుతం వారి పేరునే రికార్డు ఉంటే మ్యుటేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. వారి పేరిట రికార్డు లేకపోతే మ్యుటేషన్ చేసుకోవాల్సి ఉంది.

మంచి అవకాశం



జిల్లాలో 30 మంది రైతులకు సంబంధించి 61.07 ఎకరాలు మాత్రమే డాటెడ్ ల్యాండ్స్ విభాగంలో ఉన్నాయి. మొత్తం 26,650 ఎకరాలను డాటెడ్ జాబితా నుంచి తొలగించాం. ఆర్‌హెచ్‌ఆర్, ఆర్‌ఎస్‌ఆర్ రికార్డుల్లో ఉన్న పేర్ల ఆధారంగా విచారణ చేపట్టి డాటెడ్ ల్యాండ్స్‌ను ఇతర సెక్షన్లకు బదిలీ చేశాం. రైతులు మళ్లీ అర్జీ పెట్టుకుంటే పరిశీలన చేస్తాం.

–నారపురెడ్డి మౌర్య, జేసీ

సాక్షి ఆధ్వర్యంలో చెస్ పోటీలు



వేదిక : ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాల
తేదీ : 16-05-23
సమయం : ఉదయం 9 గంటలకు

కర్నూలు టౌన్: సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ కర్నూలు నగరంలోని ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో చదరంగం (చెస్) పోటీలు నిర్వహిస్తున్నారు. అండర్-8 అండర్-10, అండర్-12 అండర్-14 అండర్-16 అండర్-18 బాల బాలికల విభాగంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి చెస్ పోటీలు ఉంటాయి. టాప్ మొదటి, రెండు విభాగాలు (కర్నూలు, నంద్యాల) అలాగే అన్ని కేటగిరిలలో విజేతలకు బహుమతులు ఉంటాయి. ఆసక్తి కలిగిన బాల బాలికలు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఈనెల 14 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సెంట్రల్ ప్లాజా సాక్షి కార్యాలయ ఫోన్ నెంబర్ 08518-255166 అలాగే జి. రామసుబ్బారెడ్డి 9010451585 సెల్ నంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. ఎలాంటి ప్రవేశ రుసుం లేదు.

క్లుప్తంగా

గ్రేడ్-1 సూపర్‌వైజర్లకు పోస్టింగ్‌లు

కర్నూలు(రాజ్‌విహార్): మహిళాశిశు సంక్షేమ, సాధికార శాఖ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్/ గ్రేడ్-1 సూపర్‌వైజర్లుగా ఎంపికైన అభ్యర్థులకు స్థానాలు కేటాయిస్తూ ఆ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీపీఎస్‌సీ నిర్వహించిన రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 6న కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. కర్నూలు జోన్ (కర్నూలు, వైఎస్సార్ కడప, అనంతపురం, చిత్తూరు ఉమ్మడి జిల్లాలు) నుంచి ఐదుగురికి పోస్టింగ్స్ ఇచ్చారు. పత్తికొండకు చెందిన జ్ఞాన చందనను ఆలూరుకు, అనంతపురానికి చెందిన కౌసల్య సాయిని పుట్టపర్తికి, కడపకు చెందిన ప్రశాంతిని మైదుకూరుకు, కోవెలకుంట్లకు చెందిన దీప్తిని ఆళ్లగడ్డకు, పులివెందులకు చెందిన స్వర్ణలతకు వేంపల్లె ప్రాజెక్టు సూపర్‌వైజర్‌గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. అయితే రాత పరీక్షలో ఎంపికైన వారిలో మరో అభ్యర్థి ఎస్టీ కావడంతో ధ్రువీకరణ కోసం డైరెక్టరేట్‌కు పంపినట్లు ఆర్‌జేడీ పేర్కొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా



మృతి చెందిన అంజి

పత్తికొండ రూరల్: ఈత సరదా బాలుడి ప్రాణం తీసింది. కొత్తపల్లి గ్రామానికి చెందిన ధనలక్ష్మి, రామక్రిష్ణ దంపతుల కుమారుడు అంజి (12) పత్తికొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 7వతరగతి పూర్తి చేశాడు. గ్రామానికి చెందిన స్నేహితులతో కలిసి హంద్రీనీవా కుడి కాలువ తూము వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. కొద్దిసేపటికి అంజి నీటిలో మునిగిపోవడంతో గమనించిన స్నేహితులు గట్టిగా కేకలు వేస్తూ గ్రామస్తులకు తెలపగా ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ ఆఫీసర్ దినకర్‌బాబు, సిబ్బంది సూర్య ప్రకాశ్, చంద్రమోహన్, రాజు గాలింపు చర్యలు చేపట్టి బాలుడి మృతదేహాన్ని వెలికి తీసి తల్లిదండ్రులకు అప్పగించారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటాలుకు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	4,779	7,119
పొద్దుతిరుగుడు	3,789	4,389
ఆముదం	4,849	5,429
వాము	6,300	19,412
ఎండు మిర్చి	4,599	17,599
శనగలు	4,269	4,269
కందులు	3,400	8,250
మొక్కజొన్న	1,420	1,805
మినుములు	7,005	7,005



'చల్లని' ఐడియా!

ఎండలు, వడగాలులతో కర్నూలు ఉక్కిరిబిక్కిరి అవుతోంది. నిన్న మొన్నటి వరకు వర్షాలతో వాతావరణం కాస్త చల్లబడినా, ఇప్పుడు పొడి వాతావరణం కారణంగా బహిరంగ ప్రాంతాల్లోనూ గాలి ఆడక జనం చెమటలు కక్కుతున్నారు. ఉదయం 10 గంటలకు మొదలు, రాత్రి 7 గంటల వరకు కూడా ఇదే పరిస్థితి ఉంటోంది. రాత్రిళ్లు ఇంట్లో కూడా నిద్ర పట్టకపోవడం చూస్తే ఎండల తీవ్రత అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎండలకు తాళలేక ఓ వ్యక్తి నగరంలోని సుందరయ్య సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఫౌంటేన్ వద్ద చొక్కా తీసేసి ఎంచక్కా ఆ నీళ్ల కింద కూర్చుండిపోవడం అందరి దృష్టిని ఆకర్షించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

పెద్దాసుపత్రిలో కిడ్నీ రోగికి అరుదైన శస్త్రచికిత్స

- ఆరోగ్యశ్రీలో రూపాయి ఖర్చులేకుండా ఆపరేషన్



ఆపరేషన్ అనంతరం కోలుకున్న రామ్మోహన్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కిడ్నీ దెబ్బతిన్న వ్యక్తికి గుండె సమస్య ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రులు శస్త్రచికిత్సకు నిరాకరించాయి. దీంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల యురాలజీ వైద్యులు ధైర్యం చేసి ఆ వ్యక్తిని ఆసుపత్రిలో చేర్చుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూపాయి ఖర్చు లేకుండా విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణం పోశారు. యురాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సీతారామయ్య తెలిపిన వివరాల మేరకు.. సి.బెళగల్ మండలం ముడుమూల గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి(65) గతంలో గ్రామీణ వైద్యుని(ఆర్‌ఎంపీ)గా పనిచేసేవాడు. అతనికి ఇటీవల కడుపునొప్పి రావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్నాడు. వైద్యులు అతని కిడ్నీలో 4 సెం.మీ రాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో పాటు అతని కిడ్నీ చీము పట్టి పూర్తిగా దెబ్బతిన్నట్లు నిర్ధారించారు. ఆపరేషన్ చేసి తొలగించాలంటే అతని గుండె బలహీనంగా ఉండటంతో వెనక్కి తగ్గారు. దీంతో మరో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ కూడా ఇదే సమాధానం ఎదురైంది. ఇలాంటి క్లిష్టమైన కేసులు చేయలేమని, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెళ్లాలని సూచించారు. దీంతో వారం రోజుల క్రితం అతను పెద్దాసుపత్రిలోని యురాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సీతారామయ్యను కలవడంతో వైద్యపరీక్షలు నిర్వహించి ఆసుపత్రిలో చేర్చుకున్నారు. గత మంగళవారం అతనికి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. కిడ్నీలో రాయితో పాటు పాడైపోయిన కిడ్నీని కూడా తొలగించారు. ప్రస్తుతం ఆ వ్యక్తి పూర్తిగా కోలుకోవడంతో కుటుంబసభ్యులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శస్త్రచికిత్సలో తనతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ముత్యశ్రీ, డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ బాలరవితేజ, అనెస్తెటిస్ట్‌లు డాక్టర్ విశాల, డాక్టర్ అనిత, డాక్టర్ సోమశేఖర్ పాల్గొన్నట్లు డాక్టర్ సీతారామయ్య పేర్కొన్నారు. ఈ శస్త్రచికిత్సను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (రూరల్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన జారీ చేసినట్లు ప్రైవేటు ఐటీఐ కళాశాలల రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు దామోదర చౌదరి, ఆదినారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారితో పాటు ఇంటర్, డిగ్రీ పాస్/ ఫెయిల్ అయిన విద్యార్థులు జూన్ 6 లోపు iti.ap.gov. in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని ఐటీఐ కళాశాలను సంప్రదించాలన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి



శివరామిరెడ్డి(ఫైల్)

కోవెలకుంట్ల: రేవనూరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీ శివరామిరెడ్డి(58) శుక్రవారం మృతి చెందాడు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథక పనుల్లో భాగంగా ఉదయం గ్రామ శివారులోని పంటకాల్వలో పూడిక తీత పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా ఎండ తీవ్రతతో సొమ్మసిల్లి పడిపోయాడు. తోటి కూలీలు నీడ ప్రదేశానికి చేర్చి ఓఆర్‌ఎస్ తాపించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృత్యువాత పడ్డాడు.

పెరవలిలో రెండిళ్లలో చోరీ



బీరువాను చూపుతున్న బాధితుడు రంగస్వామి

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున రెండు ఇళ్లలో చోరీ జరిగింది. రూ.3.75 లక్షలు విలువ చేసే బంగారాన్ని దొంగలు అపహరించారు. రంగస్వామి బసినేపల్లిలో సచివాలయంలో విధులు నిర్వహిస్తూ పెరవలిలో కాపురం ఉంటున్నారు. ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి గుంతకల్లు వెళ్లారు. ఇంట్లోకి చొరబడిన దొంగలు.. 5 జతల కమ్మలు, చైన్, రెండు ఉంగరాలు, రూ.50 వేలు నగదు అపహరించినట్లు బాధితుడు తెలిపారు. అలాగే బసన్న కుటుంబం పెళ్లికి వెళ్లడంతో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మూడు జతల కమ్మలు, రెండు జతల మాటీలు, వెండి కుంకుమ భరిణి దోచికెళ్లినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ పరిసరాలను పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు సీఐలకు స్థానచలనం

కర్నూలు(సిటీ): జిల్లాలో ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ఆదోని త్రీటౌన్ సీఐగా పనిచేస్తున్న కె.శ్రీరామ్‌ను వీఆర్‌కు పంపించారు. కర్నూలు రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.నరసింహరాజుకు ఆదోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్స్ సామర్థ్యాన్ని పెంచండి

- కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్): బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్స్ సామర్థ్యాన్ని పెంచాలని కర్నూలు ఎంపీ, టెలికాం అడ్వైజరీ కమిటీ చైర్మన్ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగ్నల్స్ సమస్యతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాలహర్వి మండలం విరుపాపురం, దేవనకొండ మండలం తువ్వదొడ్డి, ఆస్పరి మండలం యాతకల్లు, పత్తికొండ మండలం పులికొండ, ఆదోని మండలం జాలిమంచి, పెద్ద కడుబూరు మండలం దొడ్డిమేకల గ్రామాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ల ఏర్పాటుకు అనుమతులు లభించాయన్నారు. టెలికాం జీఎం జి. రమేష్ మాట్లాడుతూ బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను మరింత మెరుగుపరుస్తామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు సయ్యద్ రోషన్ అలీ, భీమేష్, కుబేరస్వామి, మధుబాబు, శశిధర్, అజయ్‌కుమార్, కృష్ణారెడ్డి, నాగేశ్వరరెడ్డి, బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు పాల్గొన్నారు.

పని కోసం డబ్బడిగితే ఇబ్బందులు తప్పవు



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఈ ఎం. ఉమాపతి.

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ పనుల కోసం డబ్బు డిమాండ్ చేస్తే ఇబ్బందులు తప్పవని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి హెచ్చరించారు. శుక్రవారం ఆయన విద్యుత్ భవన్ నుంచి లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌స్టేషన్ ఆపరేటర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ, గృహ, వాణిజ్య, వ్యాపార కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే వినియోగదాల నుంచి డబ్బులు అడగడం, సార్ వాళ్లకు ఇవ్వాలని చెప్పడం సరైంది కాదన్నారు. వాళ్ల పేర్లు.. వీళ్ల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చినప్పుడు వాళ్లంతా తప్పించుకుంటారని, చివరకు మీరే బలవుతారన్నారు. ఈ విషయంలో తనతో విజిలెన్స్, పోలీసులు, ఏసీబీ అధికారులు నిఘా పెట్టినట్లు హెచ్చరించారు. పనులను నిర్లక్ష్యంతో కాకుండా భద్రతతో చేయాలన్నారు. ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తే చర్యలు తప్పవన్నారు.

ఫైనాన్స్ కంపెనీ అధికారులు వాహనం తీసుకెళ్లారని..



మృతుడు బాలస్వామి (ఫైల్)

మిడుతూరు: ఫైనాన్స్ కంతు కట్టలేదని తనకు జీవనాధారమైన వాహనాన్ని ఫైనాన్స్ కంపెనీ అధికారులు తీసుకెళ్లడంతో అవమాన భారంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ మారుతిశంకర్ తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గుంజ బాలస్వామి (38) పదేళ్ల క్రితం పీరుసాహెబ్ పేట గ్రామానికి చేరుకుని పొలం పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఇటీవల శ్రీరామ ఫైనాన్స్‌లో లోన్ తీసుకుని బొలెరో వాహనం కొనుగోలు చేశాడు. అయితే ఫైనాన్స్ నెల కంతు చెల్లించలేదని నందికొట్కూరులో ఉన్న బొలెరో వాహనాన్ని ఫైనాన్స్ అధికారులు గురువారం మధ్యాహ్నం తీసుకెళ్లారు. అవమానం భరించలేక బాలస్వామి శుక్రవారం ఉదయం నాగలూటి పొలం రస్తాలో పురుగు మందు సేవించి తన భార్య కృష్ణవేణికి సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబీకులు అపస్మారక స్థితిలో ఉన్న బాలస్వామిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి
- ఎస్‌ఐతో పాటు నిందితులకు గాయాలు



మృతిచెందిన కానిస్టేబుల్ అన్సర్ బాషా (ఫైల్)

కర్నూలు: మద్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ అన్సర్ బాషా మృతి చెందాడు. ఈ ఘటనలో సెబ్ ఎస్‌ఐ జిలానీ బాషాతోపాటు నిందితులకు గాయాలయ్యాయి. కర్నూలు మండలం వెంకన్నబావి బాలాజీ విల్లాస్ కాలనీలో నివాసముంటున్న అన్సర్ బాషా కర్నూలు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. రెండేళ్లుగా పంచలింగాల సెబ్ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి కర్నూలు సీతారామ్ నగర్‌కు చెందిన షణ్ముఖ శ్రీనివాస్, చాకలి సురేంద్ర అలంపూరు నుంచి ద్విచక్ర వాహనంపై రెండు కేసుల బీరు సీసాలు (24 బాటిళ్లు) తీసుకొని వస్తున్నట్లు సమాచారం అందింది. చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసేందుకు వాహనం ఆపినప్పటికీ వేగం పెంచి కర్నూలు వైపు వెళ్లారు. దీంతో సెబ్ ఎస్‌ఐ జిలానీ బాషాతో కలసి కానిస్టేబుల్ అన్సర్ బాషా ద్విచక్ర వాహనంపై వారిని వెంబడించారు. సుధాకర్ మార్కెటింగ్ లిమిటెడ్ కంపెనీ దగ్గర మద్యం రవాణాదారుల వాహనం అదుపు తప్పి కింద పడింది. ఇదే సమయంలోనే గుర్తు తెలియని వాహనం ఎస్‌ఐ ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో కానిస్టేబుల్ అన్సర్ బాషా, ఎస్‌ఐ జిలానీ బాషాలు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి చెందాడు. ప్రైవేటు ఆసుపత్రిలో ఎస్‌ఐ జిలానీ బాషా వైద్యచికిత్సలు పొందుతున్నాడు. ఈయన 2016లో ఎక్సైజ్ శాఖలో చేరి ప్రస్తుతం సెబ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అన్సర్ బాషా.. 2011లో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరాడు. ఈయన తండ్రి ఖాశీం వలి కూడా పోలీసు శాఖలో ఎస్‌ఐ హోదాలో పదవీ విరమణ పొందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొని తన భర్త మృతిచెందినట్లు అన్సర్ బాషా భార్య నూర్ అఫ్రీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక కేసు, ఎస్‌ఐ జిలానీ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మద్యం రవాణాదారులపై మరో కేసు నమోదు చేసి కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. మద్యం రవాణాదారులు షణ్ముఖ శ్రీనివాస్, చాకలి సురేంద్రలు కూడా గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ అన్సర్ బాషా మృతదేహానికి కల్లూరు వక్కెరవాగు దగ్గర (కృష్ణానగర్ సమీపంలో) శ్మశాన వాటికలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, సహోద్యోగులు అంత్యక్రియల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

88 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



సీజ్ చేసిన వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించిన దృశ్యం

బనగానపల్లెరూరల్: పట్టణంలోని అవుకు రోడ్డులో మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. వివిధ గ్రామాల నుంచి సేకరించిన ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని బనగానపల్లె పట్టణంలో ఉన్న రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే దాడులు చేశామన్నారు. సుమారు 88 క్వింటాళ్ల బియ్యాన్ని, వాహనాలను సీజ్ చేశామన్నారు. వాహనాల డ్రైవర్లు దొర్నిపాడుకు చెందిన శివ, గోకులదిన్నె గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించడంతో ఈ బియ్యాన్ని స్థానికంగా ఉన్న పలు రైస్ మిల్లుకు తరలిస్తున్నట్లు తేలిందన్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక సివిల్ సప్లయ్ గిడ్డంగి అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ తహసీల్దార్ వెంకటనారాయణ, సీఎస్‌డీటీ రబ్బాని, విజిలెన్స్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	123	62,028
నిఫ్టీ ▲	18	18,315

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,246	▽	82
డోజోన్స్	33,132	▽	176
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,754	▲	24
డాక్స్	15,914	▲	79
షాంఘై	3,272	▽	37
నికాయ్	29,388	▲	261

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై		
బంగారం (24 క్యారట్)		
60,964	▽	621
బంగారం (22 క్యారట్)		
60,720	▽	619
వెండి (కిలో)		
72,040	▽	2,755

మైనర్ల పేరిట పెట్టుబడి నిబంధనల్లో మార్పులు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్‌లో మైనర్ పేరిట సంరక్షకులు చేసే పెట్టుబడులకు సంబంధించిన నిబంధనల్లో సెబీ మార్పులు చేసింది. దీని కింద మైనర్ పేరిట చేసే పెట్టుబడులకు.. వారి ఖాతా లేదా తల్లి దండ్రులు లేదా సంరక్షకుల ఖాతాల నుంచి ఏ రూపంలో అయినా చెల్లింపులను మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు అనుమతించాలి. తల్లి దండ్రి లేదా సంరక్షకులతో జాయింట్ అకౌంట్ నుంచి చెల్లింపులు చేసినా ఆమోదించాల్సి ఉంటుంది. జూన్ 15 నుంచి ఇందుకు అవకాశం కల్పించేందుకు



కావాల్సిన ఏర్పాట్లను, సవరణలను చేసుకోవాలని అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు (ఏఎంసీలు) సెబీ ఆదేశాలు జారీ చేసింది. పెట్టుబడుల ఉపసంహరణ మొత్తాన్ని మైనర్ ఖాతా లేదా తల్లిదండ్రి, సంరక్షకులతో జాయింట్ ఖాతాకు మాత్రమే జమ చేయాల్సి ఉంటుంది.

రిటైల్ ధరలు దిగొచ్చాయ్!

ఏప్రిల్‌లో 4.7 శాతానికి తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం • 18 నెలల కనిష్టం • ఆహారోత్పత్తుల రేట్లు డౌన్

న్యూఢిల్లీ: కూరగాయలు, నూనెలు తదితర ఆహారోత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టడంతో రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్టానికి తగ్గింది. రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించుకున్న ద్రవ్యోల్బణ పరిమితి లక్ష్యానికి కాస్త చేరువగా 4.7 శాతానికి పరిమితమైంది. చివరిసారిగా 2021 అక్టోబర్‌లో ఇది 4.48 శాతం స్థాయిలో నమోదైంది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఇలా తగ్గడం ఇది వరుసగా రెండో నెల. గతేడాది ఏప్రిల్‌లో ఇది 7.79 శాతంగా ఉండగా ఈ ఏడాది మార్చ్‌లో 5.66 శాతానికి పరిమితమైంది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి (రెండు శాతం అటూ ఇటుగా) కట్టడి చేయాలని రిజర్వ్ బ్యాంక్‌ను కేంద్ర ప్రభుత్వం సూచించిన సంగతి తెలిసిందే. తాజాగా జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) విడుదల చేసిన డేటా ప్రకారం ఏప్రిల్‌లో ఆహారోత్పత్తుల బాస్కెట్ ద్రవ్యోల్బణం 3.84 శాతంగా ఉంది. ఇది ఈ ఏడాది మార్చ్‌లో 4.79 శాతంగా, గత ఏప్రిల్‌లో 8.31 శాతంగా ఉంది. నూనెల ధరలు 12.33 శాతం, కూరగాయల రేట్లు



(6.5 శాతం), మాంసం..చేపలు (1.23 శాతం) తగ్గాయి. అటు సుగంధ ద్రవ్యాలు, పాలు.. పాల ఉత్పత్తులు మొదలైన వాటి రేట్లు పెరిగాయి. రిటైల్ ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 4.68 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 4.85 శాతంగా ఉంది. ఎంపిక చేసిన 1,114 పట్టణ మార్కెట్లు, 1,181 గ్రామాల నుంచి క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాల ఆధారంగా ఎన్‌ఎస్‌వో ఈ డేటా రూపొందించింది. మే–జూన్ మధ్యకాలంలో సీపీఐ ద్రవ్యోల్బణం 4.7–5 శాతం శ్రేణిలో తిరుగాడవచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. తాజా గణాంకాలను బట్టి చూస్తే ఆర్‌బీఐ తదుపరి పాలసీ సమీక్షలో వడ్డీ రేట్ల పెంపును నిలిపే అవకాశాలు ఎక్కువే కనిపిస్తున్నాయని, అయితే రేట్ల తగ్గింపునకు మాత్రం చాలా కాలం పట్టేయవచ్చని పేర్కొంది.

సరైన దిశలోనే పరపతి విధానం: ఆర్‌బీఐ గవర్నర్



ఏప్రిల్‌లోనూ రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం 'చాలా సంతృప్తినిచ్చే' అంశమని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ఇది .. ద్రవ్యపరపతి విధానం సరైన దిశలోనే సాగుతోందనే నమ్మకం కలిగిస్తోందని పేర్కొన్నారు. అయితే, దీని ఆధారంగా పరపతి విధానంలో ఏవైనా మార్పులు ఉండవచ్చా అనే ప్రశ్నకు.. తదుపరి పాలసీ సమీక్ష రోజైన జూన్ 8న దీనిపై స్పష్టత వస్తుందని వ్యాఖ్యానించారు.

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ4లో రూ. 5,408 కోట్లు
- షేరుకి రూ. 2 డివిడెండ్

న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నష్టాలను వీడి రూ. 5,408 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 1,033 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 78,439 కోట్ల నుంచి రూ. 1,05,932 కోట్లకు ఎగసింది. ఇక ఇదే కాలంలో స్టాండెలోన్ నికర లాభం రూ. 413 కోట్ల నుంచి రూ. 2,696 కోట్లకు జంప్‌చేసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం టర్న్‌అరౌండ్ సాధించింది. రూ. 2,414 కోట్ల కన్సాలిడేటెడ్ నికరలాభం ఆర్జించింది. 2021–22లో రూ. 11,441 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,78,454 కోట్ల నుంచి రూ. 3,45,967 కోట్లకు ఎగసింది. వాటాదారులకు షేరుకి రూ. 2 డివిడెండ్ ప్రకటించింది. డీవీఆర్‌కు రూ. 2.1 చెల్లించనుంది.

భారీ పెట్టుబడులు: గతేడాది క్యూ4లో బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్‌రోవర్(జేఎల్‌ఆర్) ఆదాయం 49 శాతం జంప్‌చేసి 7.1 బిలియన్ డాలర్లకు చేరింది. పూర్తి ఏడాదికి 25 శాతం అధికంగా 22.8 బిలియన్ డాలర్ల టర్నోవర్ సాధించింది. క్యూ4లో 24 శాతం వృద్ధితో 94,649 జేఎల్‌ఆర్ వాహనాలు విక్రయమైనట్లు సంస్థ తాత్కాలిక సీఈవో ఆడ్రియన్ మార్డెల్ తెలియజేశారు. పూర్తి ఏడాదికి 9% అధికంగా 3,21,362 యూనిట్ల హోల్‌సేల్ అమ్మకాలు నమోదైనట్లు వెల్లడించారు. ఇక దేశీయంగా ప్యాసింజర్ వాహన హోల్‌సేల్ విక్రయాలు 45 శాతం ఎగసి 5.38 లక్షలను తాకినట్లు టాటా మోటార్స్ పీవీ ఎండీ శైలేష్ చంద్ర పేర్కొన్నారు. 2023–24లో రూ. 38,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికలున్నట్లు టాటా మోటార్స్ గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ వెల్లడించారు.



ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 0.8 శాతం బలపడి రూ. 516 వద్ద ముగిసింది.

62,000 ఎగువకు సెన్సెక్స్

ముంబై: వారాంతాన తొలుత నీరసంగా ప్రారంభమైన దేశీ స్టాక్ మార్కెట్లు చివరికి కోలుకున్నాయి. స్వల్ప లాభాలతో నిలిచాయి. సెన్సెక్స్ దాదాపు ఐదు నెలల తదుపరి తిరిగి 62,000 పాయింట్ల మార్క్‌ను అధిగమించింది. 123 పాయింట్లు జమ చేసుకుని 62,028 వద్ద ముగిసింది. ఇంతక్రితం 2022 డిసెంబర్ 12న ఈ స్థాయిలో నిలిచింది. నిఫ్టీ 18 పాయింట్లు పుంజుకుని 18,315 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 61,578 వద్ద కనిష్టాన్ని, 62,111 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ సైతం 18,343–18,195 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. యూఎస్, చైనా ఆర్థిక గణాంకాలు మందగమన సంకేతాలివ్వడంతో తొలుత ఇన్వెస్టర్లు నిరాశకులోనైనట్లు నిపుణులు పేర్కొన్నారు. తదుపరి తగ్గనున్న ద్రవ్యోల్బణ అంచనాలు సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు తెలియజేశారు.

బ్లూచిప్స్ డీలా: ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా బ్యాంకింగ్, ఆటో రంగాలు 0.75% చొప్పున పుంజుకోగా.. మెటల్, మీడియా, ఆయిల్, ఫార్మా 1.9–0.6% మధ్య డీలా పడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐషర్ 6% జంప్‌చేయగా.. ఎంఅండ్ఎం, ఇండస్‌ఇండ్, యాక్సిస్, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్ టెక్,



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ 2–0.5% బలపడ్డాయి. ఇతర బ్లూచిప్స్‌లో హిందాల్కో, బీపీసీఎల్, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, టాటా స్టీల్, అల్ట్రాటెక్, డాక్టర్ రెడ్డీస్, సిప్లా, అదానీ పోర్ట్స్, నెస్లే, జేఎస్ డబ్ల్యూ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ 3.6–1% క్షీణించాయి.

చిన్న షేర్లు వీక్

చిన్న షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్‌ఈలో మిడ్ క్యాప్ 0.35 శాతం నీరసించింది. నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ. 1,014 కోట్లు ఇన్వెస్ట్ చేయగా.. దేశీ ఫండ్స్ రూ. 922 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించాయి. ఇక డాలరుతో మారకంలో రూపాయి స్వల్పంగా 9 పైసలు తగ్గి 82.18 వద్ద ముగిసింది.

పారిశ్రామికోత్పత్తి డౌన్

- మార్చిలో 1.1%; 5 నెలల కనిష్టం
- తయారీ, విద్యుత్.. పేలవ పనితీరు

న్యూఢిల్లీ: దేశీయంగా పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి మార్చిలో మందగించింది. విద్యుత్, తయారీ రంగాల పేలవ పనితీరుతో అయిదు నెలల కనిష్టానికి పడిపోయి.. 1.1%గా నమోదైంది. చివరిసారిగా 2022 అక్టోబర్‌లో అత్యంత తక్కువ స్థాయి వృద్ధి నమోదైంది. అప్పట్లో ఐఐపీ 4.1% క్షీణించింది. గతేడాది మార్చిలో ఇది 2.2% కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో 5.8%గా ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) డేటా ప్రకారం ...

- విద్యుదుత్పత్తి రంగం 6.1 శాతం వృద్ధి నుండి 1.6 శాతం క్షీణత నమోదు చేసింది.
- తయారీ రంగం వృద్ధి 1.4 శాతం నుంచి 0.5 శాతానికి నెమ్మదించింది.
- మైనింగ్ రంగం ఉత్పత్తి 3.9 శాతం నుంచి 6.8 శాతానికి పెరిగింది.



- క్యాపిటల్ గూడ్స్ విభాగం వృద్ధి 2.4 శాతం నుంచి 8.1 శాతానికి ఎగసింది.
- ప్రైమరీ గూడ్స్ వృద్ధి గత మార్చిలో 5.7% ఉండగా ప్రస్తుతం 3.3%గా నమోదైంది.
- కన్జూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి మైనస్ 3.1 శాతం నుంచి మైనస్ 8.4 శాతానికి పడిపోయింది. కన్జూమర్ నాన్–డ్యూరబుల్ గూడ్స్ తాజాగా మైనస్ 3.1%కి చేరింది.
- ఇన్‌ఫ్రా/ నిర్మాణ ఉత్పత్తుల వృద్ధి 5.4 శాతంగా ఉంది. గత మార్చిలో ఇది 6.7 శాతం.
- 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఐఐపీ వృద్ధి 5.1 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది 11.4%.

వేదాంతా లాభం క్షీణత

క్యూ4లో రూ. 3,132 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 57 శాతం క్షీణించి రూ. 3,132 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 7,261 కోట్లు ఆర్జించింది. అల్యూమినియం బిజినెస్ తగ్గడం, రైటాఫ్‌లు లాభాలను దెబ్బతీశాయి. అయితే త్రైమాసికవారీగా(క్యూ3) చూస్తే నికర లాభం(రూ. 3,092 కోట్లు) 1 శాతం బలపడింది. అయితే మొత్తం ఆదాయం 5 శాతం క్షీణించి రూ. 37,225 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 39,342 కోట్ల టర్నోవర్ సాధించింది. జింక్ నుంచి ముడిఇనుము వరకూ కమోడిటీ ధరలు తగ్గడం ఫలితాలను ప్రభావితం చేసింది. వీటికితోడు



చమురు, గ్యాస్ బిజినెస్ నుంచి రూ. 1,336 కోట్ల మేర అనుకోని నష్టం వాటిల్లినట్లు కంపెనీ వెల్లడించింది. ఇక గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 1,45,404 కోట్ల టర్నోవర్ అందుకుంది.

పెట్టుబడులకు సై

గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ అనిల్ అగర్వాల్ సోదరుడు నవీన్ అగర్వాల్, కుమార్తె ప్రియా అగర్వాల్‌లను బోర్డు ఐదేళ్లపాటు డైరెక్టర్లుగా తిరిగి నియమించినట్లు వేదాంతా పేర్కొంది. చమురు, గ్యాస్ అన్వేషణకు 29.6 కోట్ల డాలర్ల పెట్టుబడి వ్యయాలకూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలియజేసింది. ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) 1.7 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలున్నట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు 2.3 శాతం నీరసించి రూ. 275 వద్ద ముగిసింది.

లైఫ్@360

మండు వేసవి. డీహైడ్రేషన్, తలనొప్పి, చెమట, ఒళ్లు పేలడం వంటి సమస్యలు ఎన్నింటినో మోసుకొస్తుంది. అయితే శతకోటి సమస్యలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లు... కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా ఆయా సమస్యల నుంచి తప్పించుకోవచ్చు. అలాంటి వాటిలో ఆహారం ఒకటి. వేసవి కాలంలో ఆరోగ్యకరమైన కొన్ని ఆహార పదార్థాలను డైట్‌లో భాగం చేసుకుంటే అవి శరీరాన్ని చల్లబరుస్తాయి. చర్మాన్ని ఆరోగ్యంగా మారుస్తాయి. అవేంటో చూద్దాం.

ఈ ఫుడ్ సమ్మర్‌కి సో గుడ్!



ఎండాకాలంలో ఎదురయ్యే సమస్యల్లో చర్మం పొడిబారడం ఒకటి. శరీరంలోని నీటి శాతం తగ్గినప్పుడు దాని ప్రభావం చర్మంపై పడుతుంది. ఫలితంగా చర్మం పొడిబారుతుంది. దీన్ని నివారించాలంటే ఆరారగా మంచినీటిని తాగడం మంచిది.

మామిడి



అధిక శాతం సి విటమిన్, ఏ విటమిన్ కలిగి ఉన్న మామిడిలో పీచు పదార్థాలు రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే పొటాషియం చెడు కొవ్వును తగ్గించి రక్తప్రసరణ వేగాన్ని మెరుగుపరుస్తుంది. దాని వల్ల గుండె సంబంధిత ఇబ్బందులు రావు.

నిమ్మ, బత్తాయి, కమలా



సిట్రిక్ జాతి పండ్లయిన నిమ్మ, బత్తాయి, కమలా వంటి వాటిలో విటమిన్ సి, ఐరన్ ఉంటుంది. ఎండాకాలంలో శరీరానికి కావల్సిన శక్తినిచ్చేవి ఇవి ఎండకు, వేడికి శరీరంలోని నీటి శాతం చెమట రూపంలో బయటికి పోతుంది.

వాల్ నట్స్



గింజల రాజుగా పిలవబడే వాల్‌నట్లలో ఫైబర్, ఒమెగా కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్లు, నిద్రని రప్పించే ట్రిప్టోఫాన్ మూలకం ఉంటుంది.

అంజీర (అత్తి పండ్లు)



అంజీర (అత్తి పండ్లు) పోషకాలతో పోల్చితే ఆపిల్, ఎండుద్రాక్షల కన్న అంజీరా చాలా మిన్న. పీచు పదార్థం ఎక్కువగా ఉన్న ఈ పండ్ల వల్ల మలబద్ధకం దూరమవుతుంది. చర్మ సమస్యలు రావు. అంతేకాదు, బరువు తగ్గాలనుకునేవారు వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది.



సోడియం, మెగ్నీషియం, పొటాషియం, క్లోరిన్, బీటాకెరోటిన్లు, ఆల్కలైన్, విటమిన్–ఏ, విటమిన్ –బి 6, విటమిన్–సి, లైకోపిన్ సమృద్ధిగా ఉంటాయి.

తాజా ఆకుకూరలు, కూరగాయలు, కీరదోస, క్యారెట్ తీసుకోవడం వల్ల వేసవి లో వచ్చే ఎలర్జీలు, వాపు, ఇన్ఫెక్షన్లు రాకుండా చూసుకోవచ్చు. మండు వేసవిలోనూ ఆరోగ్యాన్ని పండించుకోవచ్చు.

మజ్జిగ



వేసవి రకరకాల శుభకార్యాలకు కూడా సీజనే. ఆయా శుభకార్యాలకు వెళ్లినప్పుడు మసాలాలూ, వేపుళ్లూ, స్వీట్లూ, పచ్చళ్లతో కడుపునిండా తినేస్తాం. దీంతో గుండెలో మంట, అజీర్తి వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. అలాంటప్పుడు కొంచెం ఉప్పు వేసిన పల్చని మజ్జిగ తాగితే హాయిగా ఉంటుంది. మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్స్ శరీరాన్ని తేమగా ఉంచడంతోపాటు, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మజ్జిగలోని కాల్షియం, ఇతర విటమిన్ల వల్ల నాడీ వ్యవస్థ పనితీరు బాగుంటుంది.

కొత్తిమీర, పుదీనా




కొత్తిమీర, పుదీనాలు రసం చేసుకొని తాగొచ్చు, బయట పనుల నిమిత్తం ఎండల్లో తిరిగేవారికి కూరల్లో కొత్తిమీర, పుదీనాలు ఎక్కువ మోతాదులో వేస్తే ఇవి శరీరాన్ని వడదెబ్బ నుండి కాపాడుతాయి.

కొబ్బరి నీళ్ళు



శరీరంలోని వేడిని తగ్గించి చల్లదనాన్ని ఇచ్చే అద్భుతమైన లక్షణం కొబ్బరి నీటిలో ఉంది. శరీరంలో సహజ లవణాల్ని కోల్పోయినప్పుడు కలిగే అలసట నుంచి కొబ్బరి నీరు కాపాడుతుంది. నీళ్ల విరేచనాలతో బాధపడే పిల్లలకు డీహైడ్రేషన్ రాకుండా కాపాడే పానీయం కొబ్బరి నీరు.

ముంజెలు




వేసవిలో తాటి ముంజెల ప్రత్యేకత చెప్పనక్కర్లేదు. ప్రత్యేకంగా వేసవిలోనే లభించే ఈ ముంజలు రుచిలోనే కాదు పోషకాల్లోనూ ముందే ఉంటాయి.

చెరుకు రసం



చెరకురసంలో ఖనిజలవణాలు అధిక పరిమాణంలో ఉండటం వల్ల నీరసంగా ఉన్నప్పుడు చెరకు రసం తాగగానే తక్షణ శక్తి వస్తుంది. చెరకు రస లో ఉండే పొటాషియం మూత్రాశయ ఇన్ఫెక్షన్లు, మంట వంటి సమస్యలను నివారిస్తుంది. కాల్షియం సమృద్ధిగా ఉండటం వల్ల దంతక్షయం రాదు.

సబ్జా గింజలు



సబ్జా గింజలు నానబెట్టిన నీటిని తాగడం వల్ల జీవక్రియలు చురుగ్గా జరుగుతాయి. శరీర పనితీరుకి ఉపకరించే ఫ్యాటీయాసిడ్స్‌తో పాటు అధికంగా పీచును కలిగి ఉండడం వీటి ప్రత్యేకత. మహిళలకు అవసరమైన ఫోలేట్, నియాసిన్, చర్మాన్ని అందంగా ఉంచే విటమిన్ 'ఇ' సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో పేరుకొన్న వ్యర్థాలను తొలగించి, రక్తాన్ని శుద్ధి చేస్తాయి.

పుచ్చకాయ

ఎండాకాలంలో పుచ్చపండు తినడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. వేసవి తాపాన్ని, దాహార్తిని తీర్చేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా శరీరంలో ద్రవాల పరిమాణం తగ్గిపోకుండా ఉండేందుకు పుచ్చకాయ ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఇందులో విటమిన్లు, పోషకాలు పుష్కలం. వ్యాధి నిరోధక శక్తి పెంచే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ 'బి', కాల్షియం,


అరటి, సపోటా, దానిమ్మ, ద్రాక్ష



ఎండాకాలం అయితే తక్షణశక్తి కోసం అరటిని ఆశ్రయించాల్సిందే. వేసవి కాలంలో దాహం ఎక్కువగా ఉంటుంది. దాహార్తిని తీర్చేందుకు సపోటా మంచి ఫలం. పోషకాలతో పాటు జీర్ణక్రియ సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది. వడదెబ్బ నుంచి రక్షిస్తూ, అందాన్ని కాపాడే పండు దానిమ్మ. ఇందులో పీచు పదార్థాలు కూడా ఎక్కువే.

హై బీపీని అదుపులో ఉంచే యోగం

అధిక రక్తపోటు ఉన్న రోగులకు గుండె జబ్బులు, స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఎక్కువ పవర్ ఉన్న మందులను వైద్యులు ప్రిస్క్రైబ్ చేస్తుంటారు. అయితే వాటివల్ల కొన్ని సైడ్ ఎఫెక్టులు తప్పవు. అలా కాకుండా కొన్ని రకాల యోగాసనాలను వేయడం ద్వారా అధిక రక్తపోటు అదుపులోకి వస్తుందని యోగనిపుణులు చెబుతున్నారు. అవేమిటో చూద్దాం.



ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం , క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి యోగా అనేది ఫిట్‌గా ఉండటానికి ఒక పురాతన మార్గం. యోగా అధిక రక్తపోటును నియంత్రించడంతోపాటు ఒత్తిడిని దూరం చేస్తుంది. ఏ యోగాసనాలు అధిక రక్తపోటును నియంత్రించగలవో తెలుసుకుందాం.

1. బాలాసన... అధిక రక్తపోటు ఉన్న రోగులకు బాలాసన భంగిమ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యల నుండి మీకు ఉపశమనం కలిగిస్తుంది. ఇది అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఈ ఆసనం ఒత్తిడిని తగ్గిస్తుంది ,శరీరం అంతటా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ ఆసనం మెడ, భుజాల నుండి ఒత్తిడిని తగ్గిస్తుంది.

2. సుఖాసనం... శ్వాసను నియంత్రించడం ఇందులో చాలా ముఖ్యమైన ప్రక్రియ. ఈ ముద్ర మీ మనస్సును ప్రశాంతపరుస్తుంది. ఒత్తిడిని తగ్గించడం ద్వారా అధిక రక్తపోటును తగ్గిస్తుంది. ప్రశాంతమైన మనస్సు మంచి ఆరోగ్యాన్నిస్తుంది.

3. శవాసనం... ఈ భంగిమ పూర్తి విశ్రాంతి కోసం. సులభమైన ఆసనాలలో ఇది ఒకటి. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. శవాసనం మనస్సును ప్రశాంతపరుస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది, శరీరానికి విశ్రాంతినిస్తుంది, తలనొప్పి, అలసట, నిద్రలేమిని తగ్గించడం ద్వారా అధిక రక్తపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

4. భుజంగాసన... భుజంగం అంటే పాము. తలను పాము పడగలా పైకి ఎత్తి, శరీరాన్ని సాగదీయడమే భుజంగాసనం. ఇది రక్త ప్రసరణను, ఆక్సిజన్‌ను మెరుగుపరుస్తుంది. ఈ భంగిమ ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. దీంతో శరీరంలో ఫ్లెక్సిబిలిటీ వస్తుంది. ఇది ఆస్తమా రోగులకు కూడా ప్రయోజనకరం.

యోగా ప్రధానంగా ఒత్తిడిని తగ్గించడం ద్వారా రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఆసనాలే కాకుండా ప్రాణాయామం కూడా చాలా ఉపయోగపడుతుంది. ఇది హైపర్ గ్లైసీమియా, అధిక రక్తపోటుకు ప్రధాన కారణాలలో ఒకటి. కపల్‌భతి ఇన్సులిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది.

తిన్న తర్వాత ఇలా చేయొద్దు!

మన అలవాట్లలో కొన్ని మన ఆరోగ్యానికి దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. ఆ అలవాట్లే మన ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తాయి. మనం తిన్న తర్వాత అలవాటుగా చేసే కొన్ని పనులు ఆరోగ్యానికి హానికరం. అందుకే భోజనం చేసిన వెంటనే చేయకూడని కొన్ని పనుల గురించి తెలుసుకుందాం.



టీ, కాఫీ: తిన్న వెంటనే టీ, కాఫీలు తాగే అలవాటు చాలా మందికి ఉంటుంది. అయితే భోజనం చేసిన తర్వాత టీ, కాఫీలు తాగడం ఆరోగ్యానికి హానికరం. ఎందుకంటే ఇది మీ ఆహారం నుండి పోషకాలను గ్రహించడాన్ని నిరోధిస్తుంది.

స్నానం: భోజనం చేసిన తర్వాత స్నానం చేయకూడదు. తిన్న తర్వాత స్నానం చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత మారుతుంది. దీనితో పాటు జీర్ణక్రియ కూడా దెబ్బతింటుంది. ఇది మీ ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు.

నిద్ర: కొందరికి భోజనం చేసిన వెంటనే నిద్ర వస్తుంది. అదే సమయంలో కొంతమంది విశ్రాంతి కోసం భోజనం తర్వాత నిద్రపోతారు. అయితే, అలా చేయడం వల్ల మీ ఆరోగ్యానికి హాని కలుగుతుంది. తిన్న తర్వాత నిద్రపోవడం మీ జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఇది తీవ్రమైన గుండెల్లో మంటకు కూడా కారణం కావచ్చు.

వ్యాయామం: కొందరు తిన్న వెంటనే వ్యాయామం చేస్తుంటారు. ఈ అలవాటును వెంటనే మార్చుకోవాలి. మీరు తిన్న వెంటనే వ్యాయామం చేయడం వల్ల అజీర్ణం ఏర్పడుతుంది. ఇది వికారం , వాంతులు, కడుపు నొప్పి మొదలైన వాటికి కారణమవుతుంది.

పండ్లు: భోజనం చేయగానే పండ్లు తినడం వల్ల ఆహారం నుంచి శరీరం తనకు కావలసిన పోషకాలను గ్రహించలేదు. దీనివల్ల అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

మన అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందంటే మంచిదే కదా..!